# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-06-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో పాల్గొంటున్నారు.**
2. **ఢిల్లీలో పర్యటిస్తోన్న ఐటీ శాఖ  మంత్రి నారా లోకేశ్ కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ, బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లేయర్‌తో ఈరోజు సమావేశమయ్యారు.**
3. **యోగాభ్యాసం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని కేంద్ర ఉక్కు పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసువర్మ పేర్కొన్నారు.**
4. **యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నంలో ఈరోజు వాక్‌థాన్ నిర్వహించారు.**
5. **ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సాహిస్తోందని పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో పాల్గొంటున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో రాష్ట్రంలో పెట్టుబడుల ప్రతిపాదనలు, పలు రంగాల్లో  ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలపై సంబంధిత అధికారులతో చర్చిస్తున్నారు. అనంతరం ముఖ్యమంత్రి ఎక్సైజ్ శాఖ, రాష్ట్రంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంపై సమీక్ష నిర్వహించనున్నారు.

--------------------------

అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించే క్రీడా నగరం నిర్మాణానికి సహకారం అందించాలని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రితో ఆయన ఈరోజు సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ..  క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను క్రీడా కేంద్రంగా మార్చేందుకు సహకారం అందించాలని కేంద్ర మంత్రి కి విజ్ఞప్తి చేశారు.

అనంతరం బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లేయర్‌తో నారా లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యకలాపాలు, విద్యలో కృత్రిమ మేధ వినియోగంపై చర్చలు జరిపారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న నైపుణ్య గణనకు సాంకేతిక మద్దతుపై ఈ సమావేశంలో చర్చించారు.

---------------------------

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధ్యానమిస్తోందని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రస్తుతం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రంలో ఖచ్చితంగా 14 విమానాశ్రయాలు  ఉండే విధంగా భవిష్యత్తు కార్యాచరణతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సంలో కర్నూలు విమానాశ్రయం కార్యకలాపాల కోసం 2 పనులకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతిని ఇచ్చిందని తెలిపారు. వచ్చే నెలలో రాష్ట్ర స్థాయి సాగర మాల సమావేశం నిర్వహించనున్నామని వెల్లడించారు.

---------------------------

యోగాభ్యాసం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని కేంద్ర ఉక్కు పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసువర్మ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఈరోజు నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ...

..వాయిస్.. 28 సెకన్లు

---------------------------

'యోగాంధ్ర' కార్యక్రమంలో విశాఖపట్నంలోని బీచ్ రోడ్డులో వాకథాన్ ను ఈరోజు నిర్వహించారు. ఏయూ కన్వెన్షన్ హాల్ నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు డోలా శ్రీ బాలా వీరాంజనేయ స్వామి, సత్యకుమార్, బీసీ జనార్దన్‌రెడ్డి, సవిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజలతో కలిసి మంత్రులు, అధికారులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాలా వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ...

..వాయిస్..25 సెకన్లు

మరోవైపు విశాఖ నగరంలో ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్న నేపథ్యంలో రేపు, ఎల్లుండి జిల్లాలోని అన్ని  పాఠశాలలకు  సెలవులు ప్రకటించామని విశాఖపట్నం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఈ రెండు రోజులు ఉదయం పూట పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగా కార్యకలాపాలు నిర్వహించాలని ఆదేశించారు.

---------------------------

ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సాహిస్తోందని పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఏలూరు జిల్లాలోని పెదవేగిలోని ఇండియన్ ఇస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ పరిశోధన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆయిల్ పామ్ పరిశోధనా, అభివృద్ధి కార్యకలాపాలపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 15 వేల హెక్టార్లలో ఆయిల్ పామ్  పంట విస్తరించాలనే లక్ష్యంతో ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కేంద్రం సహకారంతో ఆయిల్ పామ్ పంట సాగు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు.

---

ఐక్య రాజ్యసమితి సూచనతో ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు ప్రపంచ దేశాలు ఈరోజు 'ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం" పాటిస్తున్నారు. మానవ శరీరంలోని ఎర్ర రక్త కణాలను క్షీణింపచేసే అతి ప్రమాదకరమైన వ్యాధినే సికిల్ సెల్ అంటారు. ఈ వ్యాధికి గురైన వారి ఎర్రరక్తకణాలు... నెల వంక ఆకారంలోకి మారతాయి. ఫలితంగా అవయవాలకు తగినంత రక్త ప్రసారం జరగదు. ఈ వ్యాధికి గురైన వారు శరీర మార్పులను గమనిస్తూ..... తగిన చికిత్స పొందితే సికిల్ సెల్ వ్యాధిని అధిగమించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ సికిల్ సెల్ ఎనిమియా మిషన్ వ్యాధి పట్ల అవహగానా కల్పిస్తోంది.

వాయిస్ (1:05 సెకన్లు)

---

రాష్ట్రంలో మరిన్ని బిసి గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయనున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం జమ్మాదేవి పేట గ్రామంలో మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మంత్రి నిన్న విద్యామిత్ర కిట్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యా రంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల్లో వసతులు ఏర్పాటు చేశామని మంత్రి వివరించారు.

---

కొత్తగా ఓటుకు దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో ఓటరు కార్డు ఇవ్వనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం – ఈసీ ఒక ప్రకటనలో తెలిపింది. ఓటరుగా నమోదై వివరాల్లో మార్పులు చేర్పులు చేసుకున్నవారికి కొత్త కార్డులు 15 రోజుల్లోపు అందించేలా వీలుగా నూతన ప్రామాణిక నిర్వహణ విధానాన్ని –ఎస్‌వోపీని ప్రవేశ పెట్టినట్లు పేర్కొంది. ఓటు కార్డుకు దరఖాస్తు చేసిన దగ్గర నుంచి ప్రతి దశలోనూ రియల్ టైమ్ ట్రాకింగ్‌కు కొత్త వ్యవస్థ వీలు కల్పిస్తుందని ఎన్నికల సంఘం వెల్లడించింది.

---

ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా విద్యుత్ ఆదా చేయవచ్చని ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ–ఎపిఎస్పీడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ రావు అన్నారు. తిరుపతిలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ, విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవడానికి ప్రతి ఒక్కరు వారి ఇంటిపైన సౌర ఫలకాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

---

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...24 సెకన్లు

=====================